

ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు

2 లో..

నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.
9100900918
9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | శుక్రవారం | 15- 08- 2025 | సంపుటి : 1 | సంచిక : 74 | పేజీలు : 8 | వెల : 4/-

## కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా
# పునరుద్ధరణ

- ప్రభుత్వం స్పందన కోసం ఎదురుచూపు
- సుప్రీంలో విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**
జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించటంపై సుప్రీం కోర్టు స్పందించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్ నెలలో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ప్రస్తావించింది. ఉగ్రదాడిని, దాడి వల్ల ఏర్పడ్డ ప్రాంతీయ భద్రతా సమస్యలను విస్మరించలేమని తేల్చి చెప్పింది. గురువారం జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నాయకత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై కీలక వ్యాఖ్యలు చేసింది. పహల్గామ్ ఉగ్రదాడిని,

మిగతా 2వ పేజీలో..



# ఈసీకి గట్టి దెబ్బ

- తొలంగించిన 65లక్షల పేర్లనుప్రచురించండి
- మరణించిన 22లక్షల మంది వివరాలు వెల్లడించండి
- 19వ తేదీలోపు వివరాలు ఇవ్వండి...22 నాటికి మాకు ఇవ్వండి
- బీహార్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారంపై విచారణ
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశం

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**
ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ తగిలింది. బీహార్ ఓటర్ జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, వారి పేర్లను తొలగించడానికి గల కారణాలను కూడా అప్‌లోడ్ చేయాలని సూచించింది. ప్రతి ఓటరు దానిని యాక్సెస్ చేయగలిగేలా ఈ జాబితాను ప్రచారం చేయాలని సూచించింది. అయితే.. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి

మిగతా 2వ పేజీలో..



## రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే
# గొప్పది ఏదీ లేదు

- ఆగస్టు 15 ప్రతి భారతీయుడికి గర్వకారణం
- ఉగ్రవాదంపై పోరాటానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం
- ఎలాంటి దాడినైనా ఎదుర్కొనేలా సాయుధదళాలు సిద్ధం
- స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్
- ద్రవ్యోల్బణం తగ్గుముఖం ..బలంగా ఆర్థిక వ్యవస్థ
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**
స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. అలాగే దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ

మిగతా 2వ పేజీలో..

# పోలీస్‌లకు డిగ్రీ


## పట్టభద్రులు కాని వారి కోసం తెలంగాణ పోలీస్ నిర్ణయం



- డిగ్రీ పూర్తిచేయలేని వారికోసం అవకాశం
- ఓపెన్ వర్సిటీతో తెలంగాణ పోలీస్ శాఖ ఒప్పందం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ-, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ-, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ- ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు దూర విద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీ-రియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ

మిగతా 2వ పేజీలో..



## టూరిస్టుల భద్రత కోసం
# ప్రత్యేక పోలీస్ దళం

- తొలిదశలో టూరిజం శాఖకు 80 మంది పోలీసుల కేటాయింపు
- పోలీస్ శాఖ,టూరిజంల మధ్య సమన్వయ సమావేశంలో డిజిపి

3 లో..

**హైదరాబాద్ :** తెలంగాణలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించ˘నట్టు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనట్టు- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు.

## నల్లగొండ పోక్సో కోర్టు
# సంచలన తీర్పు

- మైనర్ బాలికపై అత్యాచారం.. హత్య కేసులో ఉరిశిక్ష

2 లో..














# వర్షాలపై అప్రమత్తం

- తక్షణ సహాయ చర్యలకు సింద్ధం కావాలి
- సహాయక చర్యలకు జిల్లాకు కోటి విడుదల
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమ త్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# మైనస్‌లోకి తెలంగాణ ద్రవ్యోల్బణం

- అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే ఈ దుస్థితి
- ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే కారణం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావు

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44శాతం ఉండగా, జాతీయ సగటు-2.10శాతంగా ఉందని గుర్తు చేశారు. జూన్‌లో రాష్ట్రంలో -0.93శాతంగా ఉంటే, దేశవ్యాప్తంగా 1.55శాతంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుదల మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతాలు కావన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయన్నారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీ-ఆర్ మండిపడ్డారు. ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని.. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని.. హోప్‌లెస్ గవర్నమెంట్, హోప్‌లెస్ గవర్నెన్స్ అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

- మైనర్ బాలికపై అత్యాచారం..హత్య కేసులో ఉరిశిక్ష

నల్గొండ- నేటి ప్రభాత సూర్య :



నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందుతుడికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో, హత్య కేసులో నిందుతుడికి ఉరిశిక్ష విధించింది. అంతేకాదు జరిమానాగా లక్షా పది వేల రూపాయలు కట్టా లని ఆదేశించింది. నిందుతుడికి ఉరిశిక్ష విధిం చిన నల్గొండ కోర్టుపై బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కూతురికి ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2013లో మొహమీ ముక్రమ్ అనే వ్యక్తి 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారం చేశాడు. అనంతరం మైనర్ బాలికను హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశాడు. మూడు రోజుల తర్వాత పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిపై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. 2015లో ఛార్జ్ షీట్ దాఖలు అయింది. గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. పోక్సో, హత్య నేరం కేసులో తాజాగా నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తీర్పు వెలువరించారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు- హత్యకు పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు ఉరిశిక్ష విధించింది. 2013లో నిందితుడు మోహమ్మీ ముకట్టము, 12 ఏళ్ల బాలిక నల్గొండలోని ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరగగా, నేడు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తుదితీర్పు వెలువరించారు.

# ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు

- అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**నాగపూర్- నేటి ప్రభాత సూర్య :** అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన జరిగిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భారత్-పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగిందని గుర్తించాలని అన్నారు. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా భారత్ మారుతుందని గడ్కరీ పేర్కొన్నారు. భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆత్మనిర్భరత సాధించడంతోపాటు- విశ్వగురువుగా భారత్ మార్చేందుకు కృషి చేయాలని గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో భారత్ బలంగా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుందన్నారు. ఆర్థికంగా, రక్షణ, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో అగ్రగామిగా ఉండటంతోపాటు- ప్రతి పౌరుడు దేశభక్తితో ఉన్నప్పుడే 'విశ్వగురువు'గా మారుతుందన్నారు.



# రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదు

మొదటిపేజీ తరువాయి..

ప్రజలను ఉద్దేశించి ముర్ము మాట్లాడుతూ.. ఆగస్టు 15 కేవలం స్వేచ్ఛా పండుగ మాత్రమే కాదని, ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదని అన్నారు. ప్రజాస్వామ్య మార్గంలో సవాళ్లు ఎదురైనప్పటికీ భారతదేశం విజయం సాధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే 78 సంవత్సరాల క్రితం దేశానికి స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ గురించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటానికి ఉదాహరణగా ఆపరేషన్ సింధూర్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. పహల్గాం దాడికి భారతదేశం తీసుకున్న నిర్ణయాత్మక, దృఢమైన ప్రతిస్పందన ఇదని, దీనితో మన సాయుధ దళాలు దేశాన్ని రక్షించడానికి ఏ పరిస్థితిని అయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని నిరూపించిందన్నారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ప్రతి వయోజన పౌరుడికి ఓటు- హక్కు ప్రసాదించిన ప్రజాస్వామ్య మార్గాన్ని మనం స్వీకరించా మని గుర్తు చేశారు. దీని ద్వారా మన విధిని నిర్ణయించుకునే హక్కును మనమే ఇచ్చుకున్నామని అన్నారు. సవాళ్లు ఉన్నప్పటికీ, భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా స్వీకరించారని, మనకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అన్నింటికంటే ముఖ్యమైనవి అన్నారు.ఆగస్టు 15 దేశ ప్రజల సమిష్టి జ్ఞాపకాలలో నిలిచిపోయే చారిత్రాత్మక తేదీ అని ఆమె పేర్కొన్నారు. సుదీర్ఘ వలస పాలనలో భారతీయులు తరతరాలుగా స్వేచ్ఛ గురించి కలలు కన్నారని అన్నారు. దేశంలోని ప్రతి మూల నుంచి ప్రజలందరూ విదేశీ పాలన సంకెళ్లను తెంచుకోవాలని శాంతియుత మార్గంలో పోరాడారని తెలిపారు. వారి పోరాటం అచంచల మైన ఆశావాదంతో నిండి ఉంది. ఇది స్వాతంత్ర్యం తర్వాత కూడా మన అభివృద్ధిని నడిపించిందని అన్నారు. రేపు మనం త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్నప్పుడు 78 సంవత్సరాల క్రితం ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన త్యాగధనులందరికీ కూడా నివాళులు అర్పిస్తామని అన్నారు. శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటు-ంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం- 2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు కూడా కనుమరుగవుతున్నాయి. సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్‌ను ముందుకు నడుపుతోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ స్వాతంత్యం÷-ర కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేశారన్నారు. అదేవిధంగా.. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామికావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి..

దాడి కారణంగా జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న ప్రాంతీయ భద్రతా సమస్యల్ని విస్మరించలేము' అని ధర్మాసనం పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలంటూ దాఖలు అవుతున్న పిటిషన్లను కలిపి ఓ జాబితా చేయాలని విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ్ కోర్టును కోరారు. ఓ బెంచ్ ఏర్పాటు- చేసి, ఓ కచ్చితమైన సమయాన్ని నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. దీనికి చీఫ్ జస్టిస్ సమాధానం ఇస్తూ 'ప్రభుత్వం నుంచి ముందు స్పందన రానివ్వండి' అని అన్నారు. కాగా, 2023 డిసెంబర్ నెలలో సుప్రీంకోర్టు జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై విచారణ జరిపింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2024 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ మధ్యలో జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. 42 సీట్లకు గానూ కూటమి ప్రభుత్వం 27 సీట్లు గెలిచింది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పా-టై సంవత్సరం అవుతున్నా రాష్ట్ర హోదా పునరుద్ధరించకపోవటంపై సుప్రీం కోర్టులో వరుసగా పిటిషన్‌లు దాఖలు అవుతున్నాయి.

# ఈసీకి గట్టి దెబ్బ

మొదటిపేజీ తరువాయి..

సంబంధిత నివేదికను తమముందు ఉంచాలని సూచించింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ విచారించారు. జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మందిలో 22 లక్షల మంది మరణించారని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. 22 లక్షల మంది మరణించినట్లయితే, దానిని బూత్ స్థాయిలో ఎందుకు వెల్లడించలేదని, పౌరుల హక్కులు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉండాలని తాము కోరుకోవడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 65 లక్షల మంది పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాన్ని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాల ని సూచించారు. ఆ విషయాన్ని గరిష్ట సర్క్యులేషన్ ఉన్న స్థానిక భాషా వార్తాపత్రికల ద్వారా, దూరదర్శన్, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించింది. జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఉంటే, అక్కడ కూడా నోటీసును ప్రదర్శించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ జాబితాలో పేరు ఉన్న వ్యక్తులు తమ పేరును ఎందుకు తొలగించకూడదో పేర్కొంటూ తమ ఆధారాలను జిరాక్స్ కాపీలతో సహా సమర్పించుకోవడానికి అవకాశాలు కల్పించాలని పేర్కొంది. ఓటర్ జాబితా నుంచి తొలగించిన పేర్లను అన్ని పంచాయతీ భవనాలు, బ్లాక్ డెవలప్‌మెంట్, పంచాయతీ కార్యాలయాల నోటీసుబోర్డుపై కూడా ప్రదర్శించాలని, తద్వారా ప్రజలు జాబితాను మాన్యువల్‌గా యాక్సెస్ చేసుకునే వీలుంటుందని తెలిపింది. బిహార్‌లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో 65 లక్షల మంది పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అదేవిధంగా.. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వాదనలు వినిపిస్తూ.. ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయి. రాజకీయ వాతావరణంలో పనిచేస్తున్న నేపథ్యంలో.. వివాదాస్పదం కాని నిర్ణయమంటూ ఏదీ లేదు. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నాం. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఓటర్ల జాబితాలో మరణించిన, వలసవెళ్లిన, ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల పేర్లను ఎందుకు వెల్లడించలేరని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ పేర్లను ఎందుకు బహిర్గతం చేయకూడదని.. తద్వారా బాధితులు 30 రోజుల్లోపు పరిష్కార చర్యలు తీసుకోవచ్చు కదా అని తెలిపింది. పౌరుల హక్కులు రాజకీయ నేతలపై ఆధారపడి ఉండకూడదని భావిస్తున్నట్లు చెప్పింది. అయితే.. తొలగించిన వ్యక్తుల జాబితాను పార్టీలకు ఇచ్చినట్లు- ఈసీ వెల్లడించింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని తెలిపింది. ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19 నాటికి బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. తొలగింపునకు కారణాలు సహా ప్రచురించి.. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని తెలిపింది.



# పోలీస్‌లకు డిగ్రీ కనీస విద్యార్హత

మొదటిపేజీ తరువాయి..

జితేందర్ మాట్లా డుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు. అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించా లని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పం దం కుదుర్చుకున్నామని వివరించారు. డిపార్ట్‌మెం ట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్న ట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సం దర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఇక అం బేద్కర్ యూనివర్సిటీ వీసీ గంటా చక్రపాణి మాట్లా డుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖల కంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన అలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు. అలాంటి వారికి మా యూనివర్సిటీ- ద్వారా ఓపెన్ డిగ్రీ చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా.. వీళ్లకు అదనంగా పోలీసింగ్‌కి కావాల్సిన శిక్షణ సైతం అందిస్తామని తెలిపారు.

# బెట్టింగ్ యాప్‌ల కేసు

## దేశవ్యాప్తంగా 17 చోట్ల ఇడి సోదాలు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** ఇల్లీగల్ బెట్టింగ్ యాప్ పరిమ్యాచ్ కేసులో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈడీ 17 చోట్ల సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌తో పాటు- ముంబయి, సూరత్, దిల్లీ, నోయిడా, జైపుర్, మధురై, కాన్పూర్‌లలోను సోదాలు జరిగాయి. ఈసందర్భంగా పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.110 కోట్లు- ఫ్రీజ్ చేసినట్లు- ఈడీ అధికారులు తెలియజేశారు. డిజిటల్ డాక్యుమెంట్లు-, మ్యూల్ ఖాతాల డెబిట్, క్రెడిట్ కార్డులు, డిజిటల్ పరికరాల ను సైతం స్వాధీనం చేసుకొన్నామన్నారు. ముంబయి సైబర్ -క్రై-ం పోలీస్‌స్టేషన్‌లో పరిమ్యాచ్ డాట్ కామ్ పై నమోదైన కేసు ఆధారంగా మరో కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు పెట్టు-బడి పెట్టిన వారి నుంచి ఏడాదిలో రూ.3 వేల కోట్లు- కాజేసినట్లు- ఈడీ పేర్కొం ది.మ్యూల్ ఖాతాల్లో నగదు ఉంచి తమిళనాడు మధురైలలో భారీగా నగదు విత్ డ్రా చేసినట్లు గుర్తించింది.హవాలా రూపంలో డబ్బును యూకేకిపంపి అక్క డ క్రిప్టో కరెన్సీగా మార్చినట్లు గుర్తించామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

# రాహుల్‌ను విమర్శించే అర్హత లేదు

**రఘునందన్ రావు వ్యాఖ్యలకు అద్దంకి కౌంటర్**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత రఘునందన్ రావుకు లేదని, బిఆర్ఎస్ సహకారంతో ఎంపిగా గెలిచి హరీష్‌రావుతో ఒప్పందం చేసుకొని రఘునందన్ రావు మెదక్ ఎంపి అయ్యారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఓ ప్రకటనలో ఆరోపించారు. నక్కకు నాగలోకానికి ఉన్న తేడా రఘునందన్ రావు, రాహుల్ గాంధీకి ఉందని ఆయన అన్నారు. పెద్ద వాళ్లపైన మాట్లాడితే పెద్ద వాడివి అయిపోతానని రఘునందన్ రావు అనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రఘునందన్ రావుకు అంత సీన్ లేదని, రఘునందన్ రావుకు బిజెపిలో అంత బేస్ లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము రఘునందన్ రావుకు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తుంటే రఘునందన్ రావు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. చనిపోయిన వాళ్లతో టి తాగే అద్భుత అవకాశం ఈసీ రాహుల్ గాంధీకి ఇచ్చిందని, చనిపోయిన వాళ్లు ఏకంగా సుప్రీంకోర్టులో ప్రత్యక్షమవుతున్నారని రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఈసీ నీళ్లు మింగుతోందని వారి బండారం బయటపడుతుందన్న భయంతో బిజెపి నాయకులు న్నారని ఆయన అన్నారు. మీరెంత మాట్లాడినా ఉపయోగం లేదని, మీ కథను మా రాహుల్ గాంధీ ముగిస్తారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

# పెద్దమ్మ గుడి కూల్చివేతపై విచారణ

- **అమ్మవారి విగ్రహం భద్రపర్చండి**
- **కూల్చివేత వివరాలు తెలపాలన్న హైకోర్టు**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** బంజారాహిల్స్ రోడ్ నెం.12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్రపరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది. అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద్ కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చివేతలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఈ మేరకు గత మంగళవారం కుంకుమార్చాన పూజకు పిలుపునిచ్చారు హిందూ సంఘాల ప్రతినిధులు. ఈ పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు- చేసుకోకుండా పెద్దమ్మగుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. కాగా, తాజాగా ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది.

# రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ బెయిల్ రద్దు

- **సుప్రీం తీర్పుతో దర్శన్, పవిత్ర గౌడ్‌ల అరెస్ట్**
- **హైకోర్టు బెయిల్ తీర్పును కొట్టేసిన సుప్రీం**
- **ఇలాంటి కేసుల్లో బెయిల్ సరికాదన్న ధర్మాసనం**



**న్యూఢిల్లీ, :** రేణుకాస్వామి (33) హత్య కేసులో నిందితులైన నటుడు దర్శన్ నటి పవిత్రా గౌడ్‌కు సుప్రీంకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఈ కేసులో నిందితుల బెయిల్ రద్దు చేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో అప్రమత్తమైన బెంగళూరు పోలీసులు తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే వీరిద్దరినీ అరెస్టు చేశారు. తొలుత పవిత్రా గౌడను ఆమె ఇంట్లోనే కస్టడీలోకి తీసుకోగా.. ఆ తర్వాత దర్శన్‌ను అరెస్టు చేశారు. దర్శన్ బెంగళూరులోని సకెరెహళ్లిలోని తన భార్య ఇంటికి వెళ్లి మీడియా నుంచి తప్పించుకొనేందుకు ఎగ్జిట్ గేట్ ద్వారా లోపలికి ప్రవేశించాడని, తన భార్య, కొడుకును కలిసిన అనంతరం పోలీసులు అరెస్టు చేసినట్టు సమాచారం. చిత్రదుర్గ నివాసి రేణుకాస్వామి హత్య కేసులో నటి పవిత్ర గౌడ, ప్రముఖ నటుడు దర్శన్ ప్రధాన నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో గతేడాది డిసెంబర్‌లో కర్ణాటక హైకోర్టు వీరికి బెయిల్ మంజూరు చేయగా.. దీన్ని రద్దుచేయాలని కోరుతూ కర్ణాటక పోలీసులు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులను కస్టడీలోకి తీసుకొని త్వరగా విచారణ చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పవిత్రకు అసభ్య సందేశం పంపాడన్న కారణంతో అతడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. రేణుకాస్వామిపై అత్యంత పాశవికంగా దాడి చేసినట్టు- విచారణలో తేలింది. అతడికి కరెంట్ షాక్ కూడా పెట్టినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దర్శన్ తన అభిమాని రేణుకా స్వామి హత్య కేసులో జైలు పాలైన విషయం తెలిసిందే. కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులో చాలా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ జస్టిస్ జెబి పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దానిని రద్దు చేసింది. 2024లో బెంగళూరులో అరెస్టు చేసినప్పుడు ఈ హత్య కేసులో నటుడు నిందితుడిగా ఉన్నాడు. పవిత్ర గౌడతో సహా చాలా మంది ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. బెయిల్ మంజూరు, బెయిల్ రద్దుతో సహా ప్రతి అంశాన్ని మేము పరిగణనలోకి తీసుకున్నాము. హైకోర్టు ఉత్తర్వులో తీవ్రమైన లోపభూయిష్టత ఉందని స్పష్టంగా తెలుస్తుంది; ఇది యాంత్రిక పక్రియను ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా, హైకోర్టు విచారణకు ముందు దశలో మాత్రమే విచారణ నిర్వహించిందని బెంచ్ పేర్కొంది. దర్శన్‌ను నిర్దోషిగా విడుదల చేయడానికి సరైన కారణం లేదు. హైకోర్టు ఉత్తర్వు ఏకపక్షంగా కనిపిస్తోంది. సాక్షుల వాంగ్మూలాలను హైకోర్టు పరిశీలించింది, ఇది ట్రయల్ కోర్టు పని. ఇంత తీవ్రమైన కేసులో, సమస్యలపై పూర్తి దర్యాప్తు లేకుండా బెయిల్ మంజూరు చేయడం తప్పు, అన్యాయమని వెల్లడించింది. బలమైన ఆరోపణలు, ఫోరెన్సిక్ ఆధారాలు బెయిల్ రద్దుకు మద్దతు ఇస్తున్నాయి. పిటిషనర్ బెయిల్ రద్దు చేయబడిందని ధర్మాసనం పేర్కొంది. దర్శన్, సహ నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు డిసెంబర్ 13, 2024న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై ఈ తీర్పు వెలువడింది. రేణుకా స్వామి హత్య కేసులో జూన్ 11, 2024న అరెస్టు అయ్యారు. ఆయన దాదాపు 7 నెలలు జైలులో ఉన్నారు. తరువాత, డిసెంబర్ 13, 2024న, కర్ణాటక హైకోర్టు ఆయనకు వైద్య కారణాలతో బెయిల్ మంజూరు చేసింది.

# భారీ వర్షాలతో జంటనగర జలాశయాలకు జలకళ

- **మూసీకి వరదతో ప్రమాదకరంగా పలుప్రాంతాలు**
- **నీట మునిగిన పురానాపూల్ స్మశాన వాటిక**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని జలాశయాలు నిండుకుండలా మారాయి. జంట నగరాలకు తాగు నీరు అందించే హిమాయత్ సాగర్ జలకళను సంతరించుకుంది. జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో 9 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ డ్రోన్ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో భారీ వర్షాలకు మూసీ పరివాహకంలోని పలు కాలువలు పొంగుతున్నాయి. హిమాయత్ సాగర్ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో మూసీలో ప్రవాహం పెరిగింది. దీంతో పురానాపూల్ శ్మశాన వాటిక నీట మునిగింది. ఫలితంగా అక్కడ జరగాల్సిన అంత్యక్రియల కు విఘాతం కలిగింది. శవాలకు కాల్చేందుకు ఉపయోగించే కట్టెలు నీటిలో తేలియాడుతున్నాయి. వర్షాల కారణంగా అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జికి ఆనుకొని గత మూడు రోజులుగా వరద ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని తగ్గించడం కోసం మూసీలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, బురద మట్టిని హైడ్రా సిబ్బంది తొలగిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరంతా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి చేరుతుండటంతో నిండుకుండగా మారాయి. దీంతో జలమండలి అధికారులు.. హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తి మూసీలోకి వరద నీటిని వదిలారు. దీంతో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బాపుఘాట్, జియాగూడ, పురానాపూల్, నయాపూల్, ఛాదర్ ఘాట్, మూసారాంబాగ్ వద్ద మూసీ ఉరకలెత్తుతోంది. జియాగూడ, పురానాపూల్ వద్ద పరివాహక ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. జియగూడ బైపాస్‌లోకి వరద రావడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు- చేశారు. మూసీని అనుకొని ఉన్న పలు ఆలయాలు, శ్మశాన వాటికల్లోకి వరద నీరు చేరింది.



ఛాదర్‌ఘాట్ వద్ద చిన్న వంతెనను తాకుతూ మూసీ ప్రవహిస్తోంది. మరోవైపు మూసారాంబాగ్ వద్ద వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రెండు రోజుల నుంచి పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు.

# ఇవిఎంలను తెచ్చిందే రాజీవ్ గాంధీ

- **రాయబరేలిలో రాజీనామాచేసి పోటీ చేసే దమ్ముందా**
- **అక్కడ దొంగ ఓట్లతోనే రాహుల్ గెలవగలిగాడు**
- **అఖిలేశ్, డింపుల్, డైమండ్ హార్బర్, వయనాడ్‌లపై అనుమానాలు**
- **మీడియా సమావేశంలో రాహుల్ పై మండిపడ్డ ఎంపి రఘునందన్**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు-. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నామని అన్నారు. రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. రాజీవ్ గాంధీ ఆలోచన ప్రోగ్రెస్, రాహుల్ గాంధీ ఆలోచన డిస్ట్రక్టివ్ అని విమర్శించారు. స్పెషల్ ఇంటె-న్సివ్ రివిజన్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని.. బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించి ఓటు తీసేస్తారనే భయపట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ గెలిచిన రాయబరెలిలో 2 లక్షల ఓట్లపై అనుమానం ఉందని.. 71 వేల 977 ఫేక్ ఓటర్స్ ఉన్నారనన్నారు ఎంపీ రఘునందన్‌రావు. 92 వేల 447 మాస్ ఓటర్ నమోదు చేశారని... 54 వేల ఫేక్ బర్త్ డే సర్టిఫికేట్‌లు పెట్టారని ఆరోపించారు. బెంగాల్‌లో డైమండ్ హార్బర్ నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయని రఘునందన్ అన్నారు. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండదెబ్బ కొట్టి తిక్కతిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం అని రఘునందన్‌రావు అన్నారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని సూచించారు.

# టూరిస్టుల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ దళం

- **తొలిదశలో టూరిజం శాఖకు 80 మంది పోలీసుల కేటాయింపు**
- **పోలీస్ శాఖ,టూరిజంల మధ్య సమన్వయ సమావేశంలో డిజిపి**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్రంలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనట్టు- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. తెలంగాణ టూరిజం శాఖ, పోలీస్ శాఖ ల మధ్య సమన్వయ సమావేశం బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ , టూరిజం శాఖ ఎం.డి వి.క్రాంతి, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డి సిహెచ్ .ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు ఈ సమన్వయ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... తొలిదశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు- పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్ ,బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందేందుకు పోలీస్ శాఖ పర్యాటక శాఖకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. షూటింగ్ పర్మిషన్లు కోసం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలని డిజిపి సూచించారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు భద్రత కల్పించడం పోలీస్ సిబ్బందికి సులభం అవుతుందని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ నిర్మతలు ముందుగా తెలియజేస్తే కార్యక్రమాలకు భద్రత కల్పించే సమయం దొరుకుతుందన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టనునట్లు- తెలిపారు. విదేశీ టూరిస్టులతో పాటు దేశంలో ఉన్న టూరిస్టులు విస్తృతంగా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని వారికి భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరం ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక, మెడికల్, వినోదాత్మక పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే వారి భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను కేటాయించాల్సి ఉందన్నారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మల్టీ జోన్ -2 ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్, రాచకొండ డిసిపి ఇందిర, ఏఐజి రమణ కుమార్, తదితరులు సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.





# సిఎం రేవంత్‌తో అందెశ్రీ, రాహుల్ సిప్లింగంజ్ భేటీ

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ప్రముఖ కవి అందెశ్రీ, గాయకుడు రాహుల్ సిప్లింగంజ్‌లు వేర్వేరుగా కలిశారు. కేవలం మర్యాదపూర్వకంగానే కవి అందెశ్రీ,సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కలిశారు. వీరికి శాలువా కప్పి సిఎం అభినందించారు. ఇటీవల రాహుల్‌కు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. అలాగే అందెశ్రీ గీతం తెలంగాణ గీతంగా అలరారుతోంది.

# మున్సిపల్ చట్టసవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభించింది. ఆర్డినెన్స్ 3కి గవర్నర్ ఆమోదం లభించడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రీశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ- మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటు- హక్కు కల్పించేలా తెలంగాణ మున్సిపల్ చట్టంలోని సెక్షన్-20కి సవరణ చేశారు.

# గిరిజన రైతులకు మద్దతుగా నిలిస్తే అరెస్టులా

**ఆర్ఎస్ ప్రవీణ్ తదితరుల అరెస్ట్‌పై మండిపడ్డ కెటిఆర్**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ.. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గరలోనే ఉందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జోస్యం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సహా ఇతర నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి.. వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని కేటీఆర్ అభివర్ణించారు. పోడు రైతులను వేధించడం ఆపి.. వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ నేతలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో సహా బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందని కేటీఆర్ హెచ్చరించారు.

# సంపాదకీయం

## ఆత్మ విమర్శ సమయమిది!

భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ.. పాలకులు, ప్రభుత్వసంస్థలు ఆత్మవిమర్శచేసుకుని ముందుకు సాగాల్సి ఉంది. మనం నిజాయితీగా పాలన చేస్తున్నామా అని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆలోచన చేయాలి. ఇన్నేళ్లయినా ఇంకా దరిద్రం తొలగిపోలేదు. ఇంకా పేదలు పేదలుగా ఉండి పోతున్నారు. పెద్దలు మరింత పెద్దలుగా మారుతున్నారు. ఆస్తులు, అంతస్తులు, డబ్బులు కొద్ది మంది వద్దే పరిమితం అవుతు న్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఆలోచన చేయాలి. పేదల ఆకలి తీర్చే పేరుతో దుబారాలు చేస్తున్నారు. రాజకీయ నేతలు తమ విలాసాలకు ప్రజా ధనం వృధా చేస్తున్నారు. పెన్షన్లు పంచడానికి విమానాలు, ప్రత్యేక హెలికాప్టర్లు ఎక్కి ఊరేగుతున్నారు.

43 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయల బియ్యం ఇస్తే... ఇప్పుడు దాని ధర రూపాయికి పడిపోయింది. ఇలా అన్ని సరుకుల ధరలు పడిపోయాయా అంటే లేదు. పేదలు ఇంకా ఉన్నారంటే పాలకుల అసమర్థతగానే చెప్పుకోవాలి. సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. పాలన సక్రమంగా సాగడం లేదనడానికి ఈ పథకం ఒక్కటి చాలు. ఇకపోతే 79 ఏళ్ల తరవాత కూడా స్వేచ్ఛగా ఓటేయలేకపోతున్నాం. మనం ఓటేయడానికి వెళ్లే సరికి ఆ ఓటు ఎవరో ఒకరు వేసి పోతున్నారు. ఇదంతా కేవలం ఎన్నికల సంఘం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానంగానే చూడాలి. ఎందుకంటే పక్కాగా ఓటరు కార్డు నేటికీ అమల్లోకి రాలేదు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయాలన్న ఆంక్షలు లేవు. ఈ రెండు అమలయితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ఒకటి పక్కాగా ఓటరుకార్డు ఉండాలి. ప్రతి ఒక్కరూ విధిగా ఓటేయాలి. ఈ రెండు అంశాలపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలి. ఆధార్, పాన్ కార్డు తరహాలో ఓటుకు పక్కా పర్మినెంట్ నంబరు ఉంటే ఇక దొంగ ఓట్ల ప్రసక్తి రాదు.

79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఎన్నికల సంఘం ఈ రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాలకులు తామే నిరంతరంగా అధికారంలో ఉండేందుకు నానాగడ్డీ కరుస్తున్నారు. అదే ఇప్పుడు దొంగ ఓట్లు, బూతుల క్యాప్చర్ వంటి సమస్యలకు దారితీస్తోంది. దీనిని నివారించగలగాలి. దేశంలో ఓటరు జాబితాల తయారీ, సవరణ కసరత్తును చేపట్టే అధికారం ఎన్నికల సంఘానిది. ఇది నిరంతర ప్రక్రియ కూడా. ఓటరు జాబితాను ఏటా సవరించడంలో తప్పు లేదు. అయితే పర్మినెంట్ ఓటరు కార్డు ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించేందుకు మాత్రమే సవరణ జరగాలి. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియ రావాలి. అంతే తప్ప ఓటరు జాబితా సవరణను పెద్ద తతంగంగా చేయరాదు. పర్మినెంట్ ఓటర్ కార్డు వస్తే..నిరంతరంగా మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరం రాకపోవచ్చు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతి పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షికమైన ఎన్నికల ద్వారా సమర్థులైన నాయకులను ఎన్నుకునే అవకాశం మనదేశంలోనే ఉంది. శక్తివంతమైన ఎన్నికల పక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది.

అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ వంటి ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఇవన్నీ తప్పకుండా సమీక్షించాల్సిన అసవరం ఉంది. భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల పక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణ సంస్కరణలను పరిశీలించాల్సిందే. ఇటీవల బీహార్‌లో ఓటర్ల సవరణ సందర్భంగా పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం వంటివాటిపై ఇసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. ఇవన్నీ చక్కబెట్టుకుంటూనే స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్ పైన ఉంది.

అయితే తరచూ వస్తున్న ఇలాంటి ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదుర్కొంటోంది. ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల అనుమానాలను లేవనెత్తుతోంది. స్పష్టంగా చదవగలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతిపైనా ఇసి దృష్టి సారించాలి. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాలకులు వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తున్నట్లు తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్ల జాబితాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. డీలిమిటేషన్ పక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసి విముఖత చూపించడం వల్ల, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా పక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదాస్పదంగా మారాయి. ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది.

అయితే ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలున్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ, సబ్సిడీతో ఆహారం,ఇళ్ల నిర్మాణ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఆకట్టుకునే సాధనాలుగా మారాయి. ఇలాంటి ఉచిత పథకాలపైనా ఇసి దృష్టి సారించాలి. ఈ పథకాలు పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకే అని చెబుతున్నా అధికార, ప్రతిపక్షపార్టీలు మాత్రం వ్యూహాత్మకంగా ఎన్నికలే లక్ష్యంగా ప్రకటనలు చేస్తున్నాయి. ఓటర్ల జాబితా తారుమారు, జెర్రీ మాండరింగ్, ఇవిఎంలపై అనుమానాలు, సంక్షేమ పథకాల దుర్వినియోగాల ప్రభావం భారత ప్రజాస్వామ్య పక్రియ చట్టబద్ధతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతే ప్రజాస్వామ్యం లేదనే చెప్పాలి. ఎన్నికల వ్యవస్థ పక్షపాత ధోరణితో ఉందన్న ఆరోపణలకు ఇసి జవాబుదారీగా ఉండాలి. సమస్యలపై ఆరోపణలు రాగానే నిజాయితీగా నిలబడాలి. విమర్శలకు జవాబు ఇవ్వాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడుతుంది. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు తక్షణ సంస్కరణలు అవసరం అన్న విషయం గుర్తిస్తేనే మనం మరింత బలంగా మనుగడ సాధించగలం.

## ప్రేలాపనలు మానండి

### పాక్ నేతలకు జైశ్వాల్ హెచ్చరిక

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా, బాధాకరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విదేశాంగ శాఖ తీవ్ర హెచ్చరికలు చేసింది. పాక్ నేతలు తమ నోటిని అదుపులో ఉంచుకోవాలని, లేకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ కారణంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చాయి. రెండు దేశాల్లోనూ ఉద్రిక్తతలు ఇప్పుడే చల్లబడుతున్న నేపథ్యంలో పాక్ నేతలు కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. అణుదాడికి దిగుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో సహా పలువురు నేతలు భారత్‌ను రెచ్చగొట్టే తరహాలో ప్రకటనలు చేస్తున్నారు.ఇటీవలి అమెరికాలో పర్యటనలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. భారత్‌పై అణు బెదిరింపులకు దిగారు. తమ అస్థిత్వానికి భారత్ ముప్పు తీసుకువచ్చే పరిస్థితి ఎదురైతే ప్రపంచంలో సగభాగాన్ని నాశనం చేస్తామంటూ బెదిరించారు. ఈ వ్యాఖ్యలకు భారత్ దీటుగానే కౌంటర్ ఇచ్చింది. తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ కూడా తీవ్రంగా స్పందించింది.




## 'ఓట్ చోర్' ప్రజలేనా?

కాంగ్రెస్ వర్సెస్ ఈసీ

ఆ పదం అనొద్దంటున్న ఈసీ

ప్రజలను అవమానించొద్దని సూచన

ఆధారాలంటే చూపాలని డిమాండ్

అఫిడవిట్‌లో తెలపాలని విజ్ఞప్తి

రాహల్ వ్యాఖ్యలపై ఈసీ ఘాటుగా స్పందన



**న్యూఢిల్లీ - నేటి ప్రభాత సూర్య :** దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో 'ఓటు చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని తప్పుపట్టిన ఈసీ.. తప్పుడు కథనాలకు కారణమయ్యే 'అసభ్యకర పదాలు' ప్రచారం చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది. ఒక వ్యక్తి-ఒకే ఓటుకు సంబంధించిన నిబంధన తొలి ఎన్నికలు జరిగిన 1951-52 నాటి నుంచి అమల్లో ఉంది. ఏ ఎన్నికల్లోనైనా ఎవరైనా రెండుసార్లు ఓటు వేసినట్లు ఆధారాలు ఉంటే లిఖితపూర్వక అఫిడవిట్ ఎన్నికల సంఘానికి ఇవ్వండి. ఎటువంటి ఆధారాలు లేకుండా దేశంలోని ఓటర్లందర్నీ 'చోర్'గా పిలవడం సరికాదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటువంటి చెడు పదబంధాలు ప్రచారం చేయడం కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిపై దాడిగా ఇసి అభివర్ణించింది. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్లు చోరీకి గురయ్యాయని ఇటీవల ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఈ అసెంబ్లీ స్థానంలో ఓడిపోవడం వల్లే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అక్కడ ఓటమి పాలయ్యారని అన్నారు. వీటిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఓటరు జాబితాల్లో తప్పిదాలకు సంబంధించి వివిధ అంశాలను లేవనెత్తుతూ ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేత విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. రాహుల్ ఆరోపణలను బిజెపి కూడా ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది.

## 16నే శ్రీకృష్ణాష్టమి పర్వదినం

### పండితుల నిర్ణయం



**తిరుమల :** శ్రీ కృష్ణజన్మాష్టమి ఎప్పుడు జరుపుకోవాలి.. ఆగష్టు 15 శుక్రవా రమా - లేక ఆగష్టు 16 శనివారమా అన్న చర్చ ఇప్పుడు మళ్లీ మొదల య్యిం ది. అష్టమి తిథి ఎప్పటి నుంచి ఎప్పటివరకూ ఉంది శ్రీకృష్ణ జన్మాష్టమి.. ఎప్పుడు జరుపుకోవాలి! పండితులు ఏమంటున్నానే విషయంలో కూడా సందిగ్ధం ఉంది. అయి తే పండుగలన్నీ తిథులను పరిగణలోకి తీసుకునే నిర్ణ యిస్తారు. ఏ రోజు సూర్యోదయానికి తిథి ఉంటే ఆ రోజునే పరిగణలోకి తీసుకుంటారు...అయితే కొన్ని పం డుగల విషయంలో రోజంతా తిథి ఉండడం ప్రధానంగా భావిస్తారు. ఈ సారి కృష్ణాష్టమి విషయంలో ఆగష్టు 16 శనివారమే పండుగ అని పండితులు నిర్ణయించారు. అయితే ఆరోజు సూర్యోదయం తర్వాత అష్టమి తిథి వచ్చింది. హిందూ క్యాలెండర్ ప్రకారం కృష్ణాష్టమి తిథి ఆగస్టు 15రాత్రి 11:49 గంటలకు ప్రారంభమై, ఆగస్టు 16 రాత్రి 09:34 గంటలకు ముగుస్తుంది. దీంతో ఈ ఏడాది ఆగస్టు 16వ తేదీన కృష్ణ జన్మాష్టమిని జరుపుకో నున్నారు. సాధారణంగా జన్మతిథి జరుపుకున్నప్పుడు సూర్యోదయానికి తిథి ఉండేలా చూసుకుంటారు. నక్షత్రం ఓ రోజు అటు ఇటుగా ఉన్నప్పటికీ తిథిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.అందుకే ఆగష్టు 16 శుక్రవారం సూర్యోదయం సమయంలో అష్టమి తిథి ఉండడంతో ఆ రోజే కృష్ణాష్టమి అని పండితులు నిర్ణయించారు.

## ట్రంప్ సుంకాలకు కారణాలు అనేకం

### కేవలం రష్యాతో చమురు బేరం మాత్రే కాదు

### విశ్లేషకుల లోతైన అంచనా



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** ట్రంప్ భారీ సుంకాల విధింపు వెనక అనేకానేక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం రష్యా (నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారనడానికి లేదంటున్నారు. ఇదొక కారణం మాత్రమేనని, అలాంటివి ఎన్నో ఇప్పుడు ముందుకేసుకుని ఉన్నారని అంటున్నారు. ట్రంప్ సుంకాల విధింపుపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూదిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ట్రంప్ పదేపదే పెద్దన్న పాత్ర పోషించినట్లు ప్రకటించుకున్నారు. అయితే భారత్ దీనిని ఖండించింది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి కారణంగా ఆయన చూపారు. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయని తెలిపారు. బ్రిక్స్ కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతోపాటు డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని భారత్ వాదిస్తోంది. దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ట్రంప్ ప్రమేయాన్ని గుర్తించడంతోపాటు నోబెల్‌శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది. అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని కూడా పలువురు ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనని అంటున్నారు. ఇకపోతే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూదిల్లీ చర్చలు జరుపుతోంది. అయితే ఇవేవీ నిలవవని, ఇది అమెరికాకు కూడా నష్టం కలిగించేదే అని అంటున్నారు.

## పాకిస్తాన్‌లో అపారమైన ఖనిజ సంపద

### దీంతో వ్యాపారం చేయాలని పాక్ తహతహ

### విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక కార్యాచరణ

**ఇస్లామాబాద్, నేటి ప్రభాత సూర్య :** ప్రస్తుతం పాకిస్తాన్ ఆర్థికంగా దివాలా తీసింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌తో మరింత పతనం అయ్యింది. సింధూజలాల నిలిపివేతతో దిక్కుతోచ కుండా ఉంది. కానీ రానున్న రోజుల్లో మాత్రం ఈ దేశం సూపర్ రిచ్ కానుందని పలు నివేదికలు చెబుతున్నాయి. ఎలాగంటే దాదాపు 3 ట్రిలియన్ నుంచి 5 ట్రిలియన్ విలువైన అరుదైన ఖనిజాలు ఈ దేశంలో దాగి ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పుడు ఈ ఖనిజ సంపదను తవ్వి ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడానికి పాకిస్తాన్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా, చైనా,సౌదీ అరేబియా, యూకే,టర్కీ, యూఏఈ లాంటి దేశాలు ఈ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్తాన్‌లో బొగ్గు, రాగి, బంగారం, ఇనుము, క్రోమైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గనులు, ఐదో అతిపెద్ద రాగి, బంగారం గనులు ఇక్కడే ఉన్నాయంటా. ఈ ఖనిజాలు బలూచిస్తాన్ భూభాగం నుంచి ఉత్తరాన ఉన్న పర్వత ప్రాంతాలు, పంజాబ్ సారవంతమైన భూములు, సింధ్ భూముల వరకు అన్ని ప్రాంతాల్లో దొరుకుతాయని చెబుతున్నారు. ఇంత సంపద ఉన్నా కూడా ఇప్పటివరకు ఈ గనులను సరిగ్గా వినియోగించలేదు. కానీ, ఇప్పుడు ఈ విషయంలో పెద్ద మార్పు రాబోతోంది. అంతర్జాతీయ పెట్టుబడులను సులభతరం చేయడానికి, ఈ గనుల నిర్వహణను ప్రాంతీయ అధికారం నుంచి కేంద్ర అధికారానికి మార్చాలని పాకిస్తాన్ ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం రాజ్యాంగ సవరణ అవసరం. దానికి సంబంధించిన చట్టం ఇప్పుడు సమీక్షలో ఉంది. ఈ మార్పు వస్తే, విదేశీ కంపెనీలకు బిడ్డింగ్, రెగ్యులేటరీ అనుమతులు, సెక్యూరిటీ క్లియరెన్స్‌లు సులభంగా జరుగుతాయి. అంటే పెట్టుబడులు వేగంగా రానున్నాయని అంచనా వేస్తున్నారు. నివేదికల ప్రకారం రాబోయే ఆరు నుంచి ఎనిమిది నెలల్లో విదేశీ కంపెనీలతో ఒప్పందాలు ఖరారు కానున్నాయి. గిల్గిట్-బల్టిస్తాన్ ప్రాంతంలో ఖనిజాల తవ్వకం హక్కులు పొందే అవకాశం కోసం చైనా ఎదురు చూస్తోంది. చైనా ఇప్పటికే పాకిస్తాన్‌లో అనేక ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతోంది. ఉత్తర బెలూచిస్తాన్, దక్షిణ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో మైనింగ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే హక్కులు పొందవచ్చని అమెరికా భావిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పాకిస్తాన్ ఖనిజ, ఇంధన రంగాలపై ఆసక్తి చూపారని తెలుస్తోంది. రేకో డిక్ రాగి-బంగారం గనులపై సౌదీ అరేబియా దృష్టి సారించింది. ఈ గనులు ప్రపంచంలోనే అత్యుత్తమ రాగి, బంగారం నిక్షేపాలలో ఒకటిగా పరిగణించ బడతాయి. సౌదీతో చర్చలు దాదాపు చివరి దశలో ఉన్నాయని అంటున్నారు. పాకిస్తాన్ ఇప్పుడు అమెరికా, యూకే, చైనా, సౌదీ అరేబియా, టర్కీ, యూఏఈ లాంటి దేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులతో డీల్స్ కుదుర్చుకుంటోంది. వీటి కోసం ప్రభుత్వం ఒక సులభమైన వన్-స్టాప్ సొల్యూషన్ సిస్టమ్‌ను తీసుకొస్తోంది. తద్వారా పెట్టుబడిదారులకు అన్ని అనుమతులు, సౌకర్యాలు ఒకే చోట దొరుకుతాయి. ఈ ఖనిజ సంపద పాకిస్థాన్ దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగల సామర్థం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ గనులు సరిగ్గా వినియోగించబడితే ఉద్యోగాలు, ఆదాయం, ఆర్థిక అభివృద్ధి వంటి అనేక ప్రయోజనాలు లభిస్తాయి.



## పురిటినొప్పులతో 4 కిలోమీటర్ల పయనం - గర్భిణీ పరిస్థితి విషమం



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, ఆగస్టు 14 నేటిప్రభాత సూర్య,
వర్షం, గుంతలు, ఎత్తుపల్లాల మార్గం ఇవన్నీ కలసి ఒక గర్భిణీకి నరకయాతనను మిగిల్చాయి. వాంకిడి మండలం గొందాపూర్‌కు చెందిన దేవ్బాయి (వయసు సుమారు 28) బుధవారం ఉదయం అకస్మాత్తుగా పురిటి నొప్పులతో బాధపడ సాగింది. గ్రామంలో రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు బైక్‌పై తరలించడం ప్రారంభించారు. ఆమెను 4 కిలోమీటర్ల దూరం బైక్‌పై వర్షంలో తడుస్తూ, గుంతలు ఎత్తుపల్లాల దారిలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. అక్కడి నుండి 108 అంబులెన్స్‌లో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన కొద్దిసేపటికి ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. కానీ ప్రసవం తరువాత దేవ్బాయి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమెను వెంటనే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. స్థానికులు ఇలాంటి అత్య వసర పరిస్థితుల్లో పేద గ్రామాల్లో రవాణా సౌకర్యాల లేమి, దారుల దురవస్థ కారణంగా గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మంచిర్యాల జిల్లాలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

### సిబ్బందికి కీలక సూచనలు



మంచిర్యాల జిల్లా, ఆగస్టు 14 నేటిప్రభాత సూర్య,
భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) హరీష్ రాజ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. తనిఖీ సందర్భంగా ఆయన ఆసుపత్రి రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఎంసీహెచ్ (మాతా–శిశు ఆరోగ్యం) విభాగం పనితీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు సంబంధించిన దస్త్రాలను పూర్తిగా పరిశీలించారు. తనిఖీ అనంతరం సిబ్బందితో సమావేశమై, గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రబలింపు అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను సకాలంలో ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
అలాగే, పరిశుభ్రత, రోగుల రికార్డుల సక్రమ నిర్వహణ, మరియు తక్షణ వైద్య సేవల అందుబాటు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు.

## 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ జాతీయ పతాకాల పంపిణీ





షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 14):
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య సూచనలతో, షాద్‌నగర్ పట్టణంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ స్టేషన్ రోడ్‌లోని ప్రతి దుకాణానికి జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. అసెంబ్లీ తిరంగా యాత్ర ఇన్‌చార్జ్ చెట్ల వెంకటేష్ నేతృత్వంలో, పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్ పటేల్ అధ్యక్షతన, ఫరూక్‌నగర్ అధ్యక్షుడు పిట్టల సురేష్ సమక్షంలో ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీ మరియు జెండా పంపిణీలో రాష్ట్ర యువ మోర్చా నాయకులు ప్యాట అశోక్, వంశీ కృష్ణ, మఠం ఋషికేష్, బోయ కురుమన్న, శ్రీనివాస చారి, జంబుల నర్సింహులు, గజ్జల ప్రవీణ్, మంగాదేవి, గుంటి అనిత, బాలరెడ్డి, రంగన్న గౌడ్, కాసోజు శివ, మాల్చాలం రాము, దివిటీ వెంకటయ్య, శివశంకర్, వికాస్, లింగారం సాయి, గుడాల రమేష్, మధు, సురేష్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఇబ్బందులు - చెన్నూరులో చెప్పుల క్యూలు

నేటిప్రభాత సూర్య, ఆగస్టు 14 మంచిర్యాల జిల్లా, చెన్నూరు:
మండల వ్యాప్తంగా యూరియా కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం యూరియా పంపిణీ జరుగుతుందని తెలిసి చెన్నూరు పట్టణంలోని వ్యవసాయ సొసైటీ కార్యాలయానికి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. వృద్ధులు, మహిళలు పొడవాటి క్యూలో నిలబడలేక, తమ చెప్పులను వరుసగా అమర్చి, పడిగాపులు కాస్తూ ఉదయం నుంచే ఎదురుచూస్తున్నారు. "వారం రోజులుగా యూరియా కోసం సొసైటీ చుట్టూ తిరుగుతున్నాం. కానీ, మాకు ఇవ్వాల్సిన బస్తాలు మరొక దారి వెళ్తున్నాయి," అని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆరోపణల ప్రకారం, చెన్నూరులో యూరియా బస్తాలను వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ నిర్వాహకులు ధనాపేక్షతో పక్కదారి పట్టిస్తున్నారని, మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేస్తున్నారని తెలిపారు.



"మహారాష్ట్రకు బస్తాలు వెళ్లిపోతున్నాయి%% కానీ మేము ఇక్కడ చెప్పులు క్యూలో పెట్టి ఎదురు చూడాల్సి వస్తోంది," అని మరో రైతు మండిపడ్డారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ఉన్న అధికారులే నిమ్మకు నీరెత్తనట్టు



వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర విమర్శలు గుప్పించారు. యూరియా పంపిణీ పారదర్శకంగా జరిగేలా, రైతులకు సమయానికి అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం





మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య, ఆగస్టు 14 :
మందమర్రి పట్టణం ఆటో యూనియన్ అధ్యక్షుడు మొయ్య రాంబాబు గారి ఆధ్వర్యంలో, రేపు జరగబోయే 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఆటో డ్రైవర్లతో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి సదానందం యాదవ్ గారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆహ్వాన కార్యక్రమంలో మాజీ గౌరవ అధ్యక్షులు రాగిడి రాం రెడ్డి గారు, యూనియన్ నాయకులు బత్తిని రాజేష్, బొల్లు రవి, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలో పట్టణ ప్రజలు, ఆటో డ్రైవర్లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య వేడుకను ఘనంగా నిర్వహించాలని యూనియన్ పిలుపునిచ్చింది. "స్వాతంత్ర్యం మనకు వారసత్వంగా రాలేదు, త్యాగంతో లభించింది. దాన్ని కాపాడటం మనందరి కర్తవ్యం" అని గౌరవ అధ్యక్షులు బండి సదానందం యాదవ్ గారు ఈ సందర్భంగా అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి - నిర్లక్ష్యం ఆరోపణలు




మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య, బెల్లంపల్లి:
ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణికి పుత్ర శోకం వెంటాడింది. బెల్లంపల్లి ప్రభుత్వ అనుపత్రిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృత శిశువు కేసులో వైద్యుల నిర్లక్ష్యం ఉందని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, శిశువు గర్భంలోనే మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు వివరణ ఇచ్చారు. కొమురంభీం–ఆసిఫాబాద్ జిల్లా గోలేటి గ్రామానికి చెందిన సువర్ణ, కరణ్ దంపతులు బుధవారం తెల్లవారుజామున బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ఉదయం 6 గంటలకు చేరిన గర్భిణికి రాత్రి 11 గంటల ప్రాంతంలోనే ప్రసవ వేదనలు ప్రారంభమయ్యాయి. డ్యూటీ డాక్టర్ ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీసినప్పటికీ, అప్పటికే బాబు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. బంధువుల కథనం ప్రకారం "మధ్యాహ్నం నుంచి మంచిర్యాల జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయమని ఎన్నిసార్లు అడిగినా పంపలేదు.



సహజ ప్రసవం అవుతుందని చెబుతూ ఆలస్యం చేశారు. అదే మా బిడ్డ ప్రాణం తీసింది," అని బాధతో సువర్ణ భర్త కరణ్ కన్నీటి పర్యంతమయ్యారు.
డాక్టర్లు మాత్రం, "శిశువు ఆసుపత్రికి వచ్చే ముందే కడుపులోనే మృతి చెందింది" అని అంటున్నారు. ఈ ఘటనపై బెల్లంపల్లి టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## స్వాతంత్ర్య దినోత్సవ సామాగ్రి దుకాణాలతో సందడి

మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య, బెల్లంపల్లి:
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందురోజు బెల్లంపల్లి పట్టణం దేశభక్తి వాతావరణంతో నిండిపోయింది. గురువారం ఉదయం నుంచే పట్టణంలోని బజార్ ఏరియాలో జాతీయ పతాకాలు, రిబ్బన్లు, బ్యాడ్జీలు, పేపర్ పతాకాలు, కాగితం పూలదండలు, బెలూన్లు, బ్యానర్లు, పిల్లల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పతాకాలు అమ్మకానికి తెచ్చిన తాత్కాలిక దుకాణాలు సందడిగా మారాయి. పాత బస్టాండ్ నుండి పాత రామా టాకీస్ చౌరస్తా వరకు ఇరువైపులా వరుసగా ఏర్పాటైన ఈ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. విద్యార్థులు, యువకులు, పెద్దలు దేశభక్తి చిహ్నాలను సేకరిస్తూ వేడుకలకు సన్నద్ధం అవుతున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, కాలనీలు కూడా జెండా ఆవిష్కరణ కార్యక్రమాల కోసం కావాల్సిన సామాగ్రి కొనుగోలులో పాల్గొంటున్నాయి. విక్రేతలు చెబుతున్నదాని ప్రకారం, గత రెండు



రోజులుగా అమ్మకాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ముఖ్యంగా పిల్లల కోసం పతాకాలతో కూడిన టోపీలు, కర్రపై కట్టే చిన్న పతాకాలు, ట్రైకలర్ చీరాలు, చేతికి కట్టుకునే బ్యాండ్లు ఎక్కువగా డిమాండ్‌లో ఉన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పట్టణం అంతా దేశభక్తి రంగులతో మెరిసిపోనుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

## కొండారెడ్డిపల్లి పాఠశాల విద్యార్థులకు ఫోటో ఐడీలు, టైలు, బెల్టులు పంపిణీ

### యువ నాయకుడు కాణం ప్రేమ్ కుమార్ గౌడ్





షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 14):
కేశంపేట్ మండల పరిధిలోనికొ ండారెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ ప్రైమరీ మరియు హై స్కూల్‌లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు యువనాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఫోటో గుర్తింపు కార్డులు, టైలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చక్రధర్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, యువత, జగన్మోహన్ రెడ్డి, దర్శన్, దశరథ్, పల్లె అశోక్, ఉదయ్ గౌడ్, మహ్మద్, వట్టెల లింగం యాదవ్, కర్నేకోట నరేష్, బుర్రి సంతోష్ గౌడ్, ఏర్పుల నర్సింహా, శ్రీశైలం, మాధవ్, అరవింద్, ఆసిఫ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలి స్థలంలో పిచ్చి చెట్లు తొలగింపు మున్సిపాలిటీ తక్షణ స్పందన



మందమర్రి, ఆగస్టు 14 నేటిప్రభాత సూర్య,
మందమర్రి పట్టణంలోని 2వ వార్డులోని కాలి స్థలంలో పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ చెట్ల కారణంగా పాములు, దోమలు అధికంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడింది. ప్రజల సమస్యలను గమనించిన 2వ వార్డు యూత్ కాంగ్రెస్ నాయకుడు డి. రాజేష్, గౌరవ మైనింగ్ మరియు ఉపాధి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి గారి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ కమిషనర్ రాజలింగు గారికి సమాచారం అందించారు. కమిషనర్ గారు వెంటనే స్పందించి, బ్లేడ్ ట్రాక్టర్‌ను అక్కడికి పంపించి పిచ్చి చెట్ల తొలగింపు పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ వేగవంతమైన స్పందనకు స్థానిక ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయం ప్రకారం, "ప్రభుత్వ అధికారులు ఇలాగే వెంటనే స్పందిస్తే, సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి" అని పేర్కొన్నారు.

## అత్యవసర వైద్యం కోసం 2 లక్షల ఎల్ ఓ సి మరియు సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందజేత

### కొందుర్గు మండల కేంద్రంలో లబ్దిదారులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు





షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 14):
షాద్ నగర్ నియోజకవర్గంలోని చౌదరిగూడ మండలం పెద్ద ఎలికిచర్ల గ్రామానికి చెందిన అజాహార్ అనారోగ్యంతో బాధపడుతూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆర్థిక సహాయం కోరగా... ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి దరఖాస్తు చేసుకునేలా సిఫారసు చేశారు. ఫలితంగా, మెరుగైన చికిత్స కోసం 2,00,000 రూపాయలవిలువ గల ఎల్వోసి మంజూరు అయ్యింది. అదేవిధంగా, కొందుర్గుకు చెందిన కే. మంజుల, శ్రీరంగపూర్ గ్రామానికి చెందిన పి. సత్యనారాయణలకు కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కొందుర్గు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, జడ్పీటీసీ తనయుడు రామకృష్ణ, పిఏసిఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మహాదేవ్ పూర్ రవీందర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ జగదీశ్వర్ గౌడ్, మాజీ సర్పంచులు రెడ్డి నర్సింలు, గోపాల్ నాయక్, గౌస్, మాజీ ఎంపీటీసీ మానయ్య, నాయకులు దర్గా రాంచేందర్, తంగెళ్లపల్లి డిప్యూటీ సర్పంచులు నర్సింలు గౌడ్, కృష్ణయ్య, సత్యం, ప్రవీణ్, కబీరు కృష్ణ, నగేశ్, చౌడాపురం ప్రభాకర్, దొరేటి రాజు, చందు, చంద్రశేఖర్, శంకర్, కోట కృష్ణ, లింగం, సంతోష్ నాయక్, హన్మంత్, సత్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికారులు



**తుర్కయంజాల్-నేటి ప్రభాత సూర్య:** ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్స్ లేని వాణిజ్య సముదాయాల యజమానులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకొనేలా తుర్కయంజాల్ మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కమిషనర్ అమరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్ స్పెక్టర్ వనిత నేతృత్వంలోమున్సిపల్ పరిధిలోని ఉన్న వ్యాపారుల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ ను పరిశీలిస్తున్నారు. లైసెన్స్ లేని వారిని తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సూచి స్తున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్త వ్యాపారాలను గుర్తించి, వ్యాపారస్తులందరూ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బావర్చి హోటల్‌కు జరిమానా...**

హోటళ్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించని రాగన్న గూడ లోని బావర్చి హోటల్ కురూ. 10000 వేలు జరిమానా విధించారు.

## సెయింట్ గ్రీ గోరి యస్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

డైరెక్టర్ థామస్ కుట్టి రంభన్





**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 14):** మండల పరిధిలో తక్కలపల్లి తండా సమీపంలో సాగర్ హైవే రోడ్డులో సెయింట్ గ్రీ గోరియస్ స్కూల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలను నిర్వహించారు. గురువారం అనంతరం.. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా గోపికల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నికృష్ణులు ఉట్టి కొట్టడంలో పోటీ పడ్డారు. ఈ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని పండుగ వాతావరణం సృష్టించారు. చిన్నపిల్లల కళా నైపుల్యాలను ఉపాధ్యాయులు అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డైరెక్టర్ థామస్ కుట్టి రంభన్ కోరారు. కరస్పాండెంట్ అలెక్స్ డి మార్ట్, ప్రిన్సిపల్ ఆంటోనీ, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తులలో ఉపాధి అవకాశాలు - మహిళలు ఇంట్లోనే ఆదాయం సృష్టించండి



**షాబాద్: నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 14)** షాబాద్ మండలం కక్కులూరు గ్రామంలో పాల ఉత్పత్తుల తయారీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పి వీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ లోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ కౌన్సిలేట్ జనరల్ బెంగళూరు మద్దతుతో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రీయ ఫార్మింగ్ పాలు ఆధారిత పదార్థాల తయారీ విధానాలు నాణ్యత నియంత్రణ నిల్వ పద్ధతులపై నిపుణులు సూచనలను అందించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మహిళలకు పాలకోవా, పెరుగు, పన్నీర్, నెయ్యి ,వంటి పదార్థాల తయారీని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా చూపించారు. స్వయం ఉపాధి అవకాశాల కోసం పాల ఉత్పత్తుల ను వ్యాపారంగా మలుచుకోవడం మార్కెటింగ్ బ్రాండింగ్ పద్ధతులపై ప్రాక్టికల్ చిట్కాలను అందించారు. రైతులు మహిళా సంఘాలు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ నుండి సర్టిఫికెట్ పొందారు. నిర్వాహకులు ఈ తరహా శిక్షణలో భవిష్యత్తులో మరిన్ని ప్రదేశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఎస్‌బిఐ సర్దార్ నగర్ బ్రాంచ్ వారి సౌజన్యంతో ఏర్పాటైన "జనసురక్ష శిబిరం"

**షాబాద్ : నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 14)** ఈరోజు షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామంలో ఎస్‌బిఐ బ్యాంకు ఆధ్వర్యంలో విడ్స్ సంస్థ వారి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, షాబాద్ మరియు ఫారూఖ్ నగర్ తరుపున ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్, కక్లూర్, అంతారం, ఎలికట్ట మరియు కేసారం గ్రామాల నుండి పా ల్గొన్న గ్రామస్తులకు పొదుపు, బడ్జెట్ మరియు ఆర్థిక ప్రణాళి క, బ్యాంకు ఖాతాల రకాలు, కె .వై. సి అప్‌డేట్ మరియు సైబర్ ఆర్థిక నేరాలకు సంబంధించి అర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు శ్యామ్ ప్రసాద్, తబస్సుమ్, నవనీత, సత్యనారాయణ, హర్షిత రెడ్డి మరియు ప్రసన్న లక్ష్మి ద్వారా 'డిజిటల్ అవేర్‌నెస్ మరియు సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్' ఆన్‌లైన్ భద్రత మరియు మోసాల నివారణపై అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ బెదిరింపులను హైలైట్ చేయడం , బలమైన పాస్‌వర్డ్‌ల ప్రాముఖ్యత, సురక్షిత లావా దేవీలు మరియు సాధారణ నవీకరణల యొక్క ప్రాము ఖ్యతను నొక్కి చెప్పడం జరిగింది. ఈ సెషన్లో పాల్గొన్నవారు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటంపై అవ సరమైన ప్రాముఖ్యత, పొదుపు మరియు సామాజిక భద్రతా పథకాల పట్ల అవగాహన కల్పించండం జరిగింది. అదే



విధంగా, సి.ఎస్ .పి ఆపరేటర్ ల ద్వారా ఈ శిబిరంలోనే ఎస్. బి. ఐ. ఖాతాదారులకు రీ -కె. వై. సి, ఆధార్ లింకేజ్, అకౌంట్ ఓపెనింగ్ మరి యు సామాజిక భద్రతా పథకాలైన పి ఎం ఎస్ బి ఐ, పి ఎం జె జె వై, మరియు ఎపివైలను ఆక్టివేట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్. బి. ఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ సర్, ఆర్.బి.ఐ జనరల్ మేనేజర్ జ్ఞాన సుప్రబాత్ సర్, ఆర్.బి.ఐ - ఏ జి ఎం రెహ్మాన్ సర్, ఎస్ బి ఐ ఏ జి ఎం విద్యాధర్ సర్, ఎస్ బి ఐ ఆర్‌ఎం నితీష్ కుమార్ సర్, ఎస్‌ఇఆర్ ఇపి షాబాద్ బాలరాజు సిసి గారు మరియు ఎస్‌ఇ ఆర్‌ఇపి విఓఎ సర్దార్ నగర్ మయూరి హాజరైనారు.

## అమ్మ పోచమ్మ చల్లంగా చూడవమ్మ

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు**

**మహిళలు బోనాలతో ఊరేగింపు**

**శివసత్తులు, పోతురాజు వేషాలతో విన్యాసాలు**





**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 14).** యాచారం మండలంలో గ్రామ ప్రజలను చల్లంగా చూడాలని గ్రామదేవత ను పోచమ్మను భక్తులు వేడుకున్నారు. గురువారం మండల పరిధిలో చింతపట్ల గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలను నిర్వహించారు. అనంతరం. ప్రతి ఇంటి నుండి బోనాలు ఎత్తుకొని ఆలయానికి మహిళలు బయలుదేరారు. అమ్మవారికి నైవిద్యాన్ని సమర్పించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తులతో పూనకాలు, పోతురాజులతో విన్యాసాలు అలరించారు. యువకులు కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపుతో వీధి వీధిన అమ్మవారిని ఊరేగించారు. భక్తులు తమ కోరికలను తీర్చాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కోరికలు తీర్చిన అమ్మవారికి మేకలు, గొర్రెలు, కోళ్లు బలిచ్చారు. ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో, చూడాలని , చెరువు , కుంట లు, నిండి పాడి పంటలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని భక్తులు పోచమ్మను మొక్కుతున్నారు. గ్రామాలలో బోనాల సందర్భంగా వీధి దీపాలతో వెలుగులు నిండాయి. బోనాల కార్యక్రమానికి యాచారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రవికుమార్ రెడ్డి, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాముని చెరువులో శ్రమదానం



**- పర్యావరణ పరిరక్షణకు ప్రజలే ముందుండాలి**

**మంచిర్యాలజిల్లా:నేటి ప్రభాతా సూర్య. ఆగష్టు. 14.:** మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు వద్ద గురువారం స్వచ్ఛంద పౌర సేవ సంస్థ ఆధ్వర్యంలో విశాల స్థాయిలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, పెద్దలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చెరువు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, కలుపు చెట్లను తొలగించి, చెత్తను సేకరించి శుభ్రత కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి రాజన్న, సంస్థ ప్రధాన కార్యదర్శి తుల మధుసూదన్ రావు మాట్లాడుతూ "చెరువులు కేవలం నీటి వనరులే కాదు, మన గ్రామాల ప్రాణాధారాలు. వీటిని కాపాడుకోవడం ప్రతి పౌరుని కర్తవ్యం. స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేయడం సమాజానికి ఆదర్శం" అని అన్నారు. చెరువు పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ, వర్షాకాలంలో నీటి నిల్వ పెంపుపై ప్రజలు క్రమం తప్పకుండా శుభ్రత కార్యక్రమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పౌర సేవ సంస్థ సభ్యులు, స్థానిక నాయకులు, పర్యావరణ ప్రియులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. శ్రమదానం అనంతరం చెరువుకు సమీపంలో చెట్లు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

## ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ సత్తయ్య పదవీకాలం పొడిగింపు





**తుర్కయంజాల్, నేటి ప్రభాత సూర్య:** తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 ఫిబ్రవరి 14వరకు సత్తయ్య పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ సహా టీజీ కాబ్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అయితే సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. అప్పుడు ఆరునెలల పాటు పొడిగించిన ప్రభుత్వం, మరోసారి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 56 సహకార సం ఘాలున్నాయి. పాలకవర్గాలకు 56 సహకార సంఘం చైర్మన్లతో పాటు వైస్‌ఛైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. సహకార సంఘాల పరిధిలో 1.25 లక్షల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. పాలక వర్గం పొడిగించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం, వ్యవసాయ శాఖ మంత్రి చిత్ర పటానికి సత్తయ్య పాలాభిషేకం చేశారు.

## భారీ వర్షాలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు





**మంచిర్యాల,జిల్లా. నేటిప్రభాత సూర్య, ఆగస్టు 14:** వాతావరణ శాఖ హెచ్చరికల మేర రాబోయే రెండు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజల రక్షణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని తిలక్ నగర్ చెరువును డీసీపీ భాస్కర్‌తో కలిసి పరిశీలించిన ఆయన, వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేందుకు 90 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ వెల్లడించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటి ప్రభాత సూర్య, (ఆగస్టు 14)** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులను నియమించడం, సెలవుల్లో ఉన్న అధికారుల, సిబ్బంది వెనక్కు రావాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతో కలసి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడచిన 24 గంటల్లో 10 సెంటీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మం చిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్ట్‌గా ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల లో తీసుకోవలసిన చర్యలపై



కలెక్టర్లను అప్రమత్తం చేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవలసిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయిలు విడుదల చేశామని అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లో లెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచిం చారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డిఆర్‌ఓ సంగీత, చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న కన్నాల రైతు వేదిక పరిసరాలు - రైతులకు ఇబ్బందులు



మంచిర్యాల జిల్లా, నేటిప్రభాత సూర్య, ఆగష్టు. 14:బెల్లంపల్లి మండలం:
బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామ రైతు వేదిక భవనం పరిసరాలు ప్రస్తుతం చెరువును తలపిస్తున్నాయి. వర్షాల దాటికి రైతు వేదిక ఎదుట భారీగా వరద నీరు నిల్వ ఉండటంతో, ఆ ప్రదేశం పూర్తిగా చిత్తడిగా మారింది.పంటలకు సంబంధించిన సాంకేతిక సలహాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వినియోగం, మరియు ఇతర వ్యవసాయ సలహాలను పొందేందుకు రైతులు తరచుగా రైతు వేదికకు రావాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం వరద నీరు కారణంగా భవనం చుట్టుపక్కల రాకపోకలు కష్టతరమవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.స్థానిక రైతులు చెబుతున్నట్లు, వేదిక వద్దకు చేరుకునే మార్గాలు మట్టితో నిండిపోయి జారిపడే పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల వృద్ధ రైతులు, మహిళా రైతులు ముఖ్యంగా సలహాల కోసం రావడంలో వెనుకంజ వేస్తున్నారు. రైతు వేదిక ప్రాంగణంలో నీరు నిల్వ ఉండటంతో దోమల సమస్య కూడా పెరుగుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి, నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

## కల్లుగీత కార్మికులకు రూ, 2016 నుండి రూ,4000 పెన్షన్ ఇవ్వాల్సిందే: కాళ్ల జంగయ్య



చింతపల్లి -నేటిప్రభాత సూర్య, (ఆగస్టు14)
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని గురువారం చింతపల్లి మండలం, కురుమేడు గ్రామంలో కల్లుగీత కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు పెన్షన్లు పెంచుతామని చెప్పి 20 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు పెన్షన్లు పెంచకపోవటమేంటని ప్రశ్నించారు. కల్లుగీత కార్మికులకు 2016 నుండి 4000 రూపాయలు పెంచు తామని మాట ఇచ్చి మాట తప్పడం ఏంటని ప్రశ్నించారు. కల్లుగీత కార్మికులకు సరైన సమయంలో పెన్షన్లు రాక దీనాస్థితిలో ఉన్నారు ఇచ్చే పెన్షన్ కూడా సమయానికి ఇవ్వకుండా నెల చివర ఇవ్వడం ఏంటని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో గీత కార్మికుల పక్షాన గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతుందని తెలిపారు. ఈనెల 17న దేవరకొండలో జరిగే పెన్షన్ ధరల నియోజకవర్గ సదస్సుకు కల్లుగీత కార్మికులు పెద్ద ఎత్తున గ్రామ గ్రామాల నుండి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు అనంతుల వెంకటయ్య గౌడ్,వీహెచ్పీఎస్ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు ముద్దం నరసింహ గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి కురుమేటి వెంకటరమణ, విహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు జిల్లా నరసింహ గౌడ్, చింతపల్లి మండల నాయకులు పులికంటి యాదగిరి, విహెచ్పిఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి. కురుమేడు గౌడ సంఘ నాయకులు జిల్లా కృష్ణయ్య గౌడ్, గౌని పాండుగౌడ్, గజ్జె శివరాజ్ గౌడ్, గౌని శ్రీశైలం గౌడ్, గునిగంటి కృష్ణయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ



మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య, ఆగష్టు, 14::
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం వేమనపల్లిలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ నేతృత్వంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.వేమనపల్లి నుండి సుంపుటం గ్రామం వరకు దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బైక్‌లపై జాతీయ పతాకాలు ఎగురవేస్తూ, 'వందే మాతరం', 'జై హింద్' వంటి నినాదాలతో వాతావరణాన్ని దేశభక్తి స్ఫూర్తితో మార్మోగించారు. ఈ సందర్భంగా ఏట మధుకర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో జాతీయ పతాకం ఎగరేయడం ద్వారా దేశభక్తిని మరింత ప్రోత్సహించాలని, యువత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకుని దేశ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. గ్రామాల మధ్యగా సాగిన ఈ ర్యాలీని ప్రజలు అభినందించారు.

## హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉపాధి భద్రత కల్పించాలి : టియుసిఐ

### పని గంటలు పెంచే 282 జీవోను రద్దు చేయాలి : జాడి దేవరాజ్



మంచిర్యాల జిల్లా, నేటిప్రభాత సూర్య,
హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని, పని గంటలు పెంచే 282 జీవోను తక్షణమే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) డిమాండ్ చేసింది.
టియుసిఐ రాష్ట్ర మహాసభ పిలుపు మేరకు ఈరోజు లక్షెట్‌పేట ఉత్కూర్ చౌరస్తా వద్ద హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ పాల్గొని మాట్లాడుతూ,
"హమాలీలకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్రమైన చట్టం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూపొందించాలి" అని అన్నారు.
తెలంగాణ రాష్ట్రంలోనే 3 లక్షలకు పైగా హమాలీ కార్మికులు వివిధ రంగాల్లో %-% వ్యవసాయ మార్కెట్లు, రైస్ మిల్లులు, సివిల్ సప్లై, ఎఫ్‌సీఐ, ప్రభుత్వ-ప్రైవేట్ గోదాంలు, ఎయిర్ హౌస్, ఆర్టీసీ ట్రాన్స్‌పోర్ట్, బజార్లలో పనిచేస్తున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వీరిని జట్టు, మూట, కలాసి, హమాలి, దడవాయి వంటి పేర్లతో పిలుస్తారని చెప్పారు."రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల్లో వీరు ముందున్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా హమాలీల సమస్యలపై ఏ ప్రభుత్వమూ చట్టబద్ధమైన చర్యలు తీసుకోకపోవడం విచారకరం" అని ఆయన విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం 2008లో అమృతసేన్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రతి రాష్ట్రం కార్మికుల స్థితిగతులు పరిశీలించి రూల్స్ రూపొందించుకోవాలని సూచించినా, 17 ఏళ్ల గడిచినా అమలు జరగకపోవడం దురదృష్టకరమని దేవరాజ్ తెలిపారు."పొద్దంతా మూటలు మోసినా పూట గడవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ చిత్తశుద్ధి నిరూపించాలి" అని ఆయన అన్నారు.

**డిమాండ్లు:**
హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలి.
పని గంటలు పెంచే 282 జీవో రద్దు చేయాలి.
కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ₹26,000 ఇవ్వాలి.
పెన్షన్ కనీసం ₹9,000 ఇవ్వాలి.
ఈ నెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటిస్తూ, అధిక సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొని దీన్ని జయప్రదం చేయాలని దేవరాజ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి పొట్టల మల్లేష్, హమాలీ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, నరేష్, తిరుపతి రాజు, మహేష్, కొమురయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.
ఇట్లు
జాడి దేవరాజ్
జిల్లా కార్యదర్శి, టియుసిఐ %-% మంచిర్యాల
95533 42686

## మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి : తహశీల్దార్



మంచిర్యాల జిల్లా,నేటిప్రభాత సూర్య,ఆగస్టు 14:
దేశ స్వాతంత్ర్యం కోసం, దేశ గౌరవం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మండల తహశీల్దార్ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన కార్యాలయంలో ఈ సందేశాన్ని ఇచ్చారు.పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుతం సింగరేణి ఏరియా ఎస్ అండ్ పిసి విభాగంలో పనిచేస్తున్న రాజేష్ పిహాల్వన్ స్వయంగా రచించిన రెండు పుస్తకాలను తహశీల్దార్ సతీష్ కుమార్‌కు బహుకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, "దేశ సరిహద్దుల్లో 19 సంవత్సరాలు ఆర్మీ జవాన్‌గా సేవలందించి, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రాజేష్ పిహాల్వన్ నేడు కూడా అదే దేశభక్తితో ప్రజల్లో జాతీయతా స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను పుస్తకాల రూపంలో అందించడం, దేశం పట్ల గౌరవం పెంచే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం" అన్నారు.
రాజేష్ పిహాల్వన్ 19 సంవత్సరాలు ఆర్మీ సేవల అనంతరం, గత 16 సంవత్సరాలుగా సింగరేణి ఎస్ అండ్ పిసి విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు దేశభక్తి పుస్తకాలు రచించిన ఆయన, అందులో 'బూంద్ బూంద్ ఖూన్ దే గయే', 'భారత్ మాతా కీ గోద్ మే' అనే రెండు పుస్తకాలను తహశీల్దార్‌కు అందజేశారు.
దేశభక్తిని అక్షరరూపంలో మలుస్తూ, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల జీవితాలను ప్రజలకు పరిచయం చేయడమే తన లక్ష్యమని రాజేష్ పిహాల్వన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి రాణి పిహాల్వన్ కూడా పాల్గొన్నారు.

## రామగుండం సీపీ సూచనలు







### బాధితుల ఫిర్యాదులకు తక్షణ స్పందన అవసరం

రామగుండం, నేటిప్రభాత సూర్య,ఆగస్టు 14:
ప్రజల నమ్మకాన్ని, పోలీసుల పట్ల గౌరవాన్ని పెంపొందించాలంటే ప్రతి ఒక్కరు క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ అన్నారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పోలీస్ అధికారులకు సూచించారు.వార్షిక తనిఖీలో భాగంగా సీపీ ఈరోజు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు పూలమొక్కలతో స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం అందించారు. అనంతరం రిసెప్షన్ సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తులో ఉన్న ఫైళ్ళు, రౌడీ షీటర్లు, కేడీ, డిసిల వివరాలను సమీక్షించారు. మిస్సింగ్ కేసులు, ఇతర నేరాలపై రికార్డులను పరిశీలించి, సంబంధిత సిబ్బందిని శాఖాపరమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడటంలో క్రమశిక్షణ, మర్యాదపూర్వక వైఖరి అవసరమని సీపీ హితవు పలికారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందించి, పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెంచేలా పనిచేయాలని సూచించారు. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరును సీపీ అభినందించారు.ఈ సందర్భంగా సీపీ, డీసీపీ చేతుల మీదుగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేష్, ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు భూమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల సమస్య పరిష్కారానికి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సహాయం



షాబాద్: నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 14)
షాబాద్ మండలం సర్దార్ నగర్ గ్రామంలో వీధి కుక్కలు సుమారుగా 8 మందిని కరిచి తీవ్రంగా గాయపరిచిన ఘటన పై గతంలో వెలువడిన వార్తకు స్పందిస్తూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ "ఎలుగంటి మధుసూదన్ రెడ్డి" ముందుకు వచ్చారు జంతు సంరక్షణ సిబ్బందికి కుక్కలను పట్టుకొని తరలించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం రూ 20,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామ ప్రజల భద్రత అత్యంత ప్రాధాన్యం పిల్లలు పెద్దలు భయపడకుండా స్వేచ్ఛగా సంచరించేందుకు చర్యలు తీసుకున్నందుకు ధన్యవాదాలు ,మధుసూదన్ రెడ్డి సహాయం ఆదర్శంగా నిలుస్తుంది అని కొనియాడారు.

## బిజెపి ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ



చింతపల్లి -నేటి ప్రభాత సూర్య (ఆగస్టు 14)
హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటిపై జాతీయ త్రివర్ణ పతాక"లో భాగంగా ,చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు . ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలనే సదుద్దేశంతో బిజేపీ నాయకులు త్రివర్ణ పతాకాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్,కుకుడపు రామకృష్ణ వెన్నం శేఖర్, గొడుగు శ్రీను ,ఎర్ర వెంకటయ్య, అభినవ్, జాతీయ వాదులు పాల్గొన్నారు.



చింతపల్లి మండల కేంద్రంలో యాదవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన పెద్దమ్మ తల్లి పండుగ. ఈ సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామదేవతలకు జలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి గ్రామానికి చెందిన యాదవ సోదరులందరూ పాల్గొన్నారు.
చింతపల్లి -నేటి ప్రభాత సూర్య ఆగస్టు 14.

## గ్రామీణ వైద్యుల సేవలు .. కష్టాల మధ్య ప్రజలకు ఆరోగ్యరక్షణ



మంచిర్యాల జిల్లా..నేటిప్రభాత సూర్య, ఆగస్టు 14:
రాష్ట్రంలోని పల్లె పల్లెల్లో వైద్య సౌకర్యాలు లేని చోట్ల, ప్రాణాలకు హామీగా నిలుస్తున్నారు గ్రామీణ వైద్యులు ు ఆర్ఎంపీలు, పీఎంపీలు. చిన్నపాటి జ్వరం, గాయాలు, కడుపు నొప్పి, ప్రమాదాల చికిత్స నుండి అత్యవసర ప్రసూతి సేవల వరకు ఎప్పుడైనా అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆరోగ్య భద్రత అందిస్తున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో, వర్షాల సమయంలో, దూరప్రాంతాల్లో ప్రభుత్వ అంబులెన్స్ లేదా డాక్టర్ చేరేలోపు, ఈ గ్రామీణ వైద్యులే ప్రాణాలను కాపాడే సూత్రధారులుగా మారుతున్నారు. ఎన్నో సందర్భాల్లో వీరి సత్వర స్పందన వల్ల తీవ్రమైన ప్రమాదాల నుండి ప్రాణాలు నిలిచాయి.అయితే ఈ సేవల వెనుక అనేక సవాళ్లు దాగి ఉన్నాయి. గుర్తింపు లేకపోవడం, చట్టపరమైన రక్షణ లేకపోవడం వీరికి పెద్ద అడ్డంకిగా మారింది. సరైన శిక్షణా సర్టిఫికేట్ లేకపోవడం వల్ల తరచుగా అధికారుల రైడ్లు, కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్రాణరక్షణ కోసం చేసిన ప్రయత్నాలు కూడా అనవసర ఆరోపణలకు దారి తీస్తున్నాయి."మేము లాభం కోసం కాదు, ప్రాణాలు రక్షించడానికి పనిచేస్తున్నాం. కానీ గుర్తింపు లేకపోవడం వల్ల మాకు భద్రతా హామీ లేదు," అని ఒక గ్రామీణ వైద్యుడు ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రజలు, ముఖ్యంగా దూర ప్రాంతాల గ్రామస్తులు, ఈ వైద్యుల సేవలపై ఆధారపడుతున్న విషయం వాస్తవం. అత్యవసర పరిస్థితుల్లో వీరిని సంప్రదించక తప్పని పరిస్థితి ఉంటుంది."గ్రామీణ వైద్యులు ఉన్నందువల్లే మా పల్లెలో ప్రాణాలు నిలుస్తున్నాయి. ప్రభుత్వం వీరికి గుర్తింపు, శిక్షణ, చట్టపరమైన రక్షణ ఇవ్వాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.వైద్య నిపుణులు కూడా అభిప్రాయపడుతూ, "సరైన శిక్షణ, పర్యవేక్షణతో ఈ గ్రామీణ వైద్యులను ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో భాగం చేస్తే, గ్రామీణ ఆరోగ్య సంరక్షణ మరింత బలోపేతం అవుతుంది" అని సూచిస్తున్నారు.

## హెూటళ్ల పై కొరడా ఝుళిపించిన శానిటరీ ఇన్ స్పెక్టర్





**తుర్కయంజాల్-నేటి ప్రభాత సూర్య:**
అపరిశుభ్రత, నాణ్యత లేని వంటకాలు నిలువ ఉన్న ఆహార పదార్థాలు వినియోగించిన బావర్చి హెూటల్ పై మున్సిపల్ శానిటరీ ఇన్ స్పెక్టర్ ఝుళిపించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు హెూటళ్లను మున్సిపల్ కమిషనర్ కి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో విస్తూ పోయే నిజాలు బయటపడ్డాయి. రాగన్నగూడ లోని డెక్కన్ బావర్చి హెూటల్లో పాడైపోయిన చికెన్, వ్యర్థ పదార్థాలు ఉండడంతో హెూటల్స్ పైరూ 10000 వేలు జరిమానా విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్ స్పెక్టర్ వనిత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%ౌ% హెూటళ్లు,బేకరీలు పరిశుభ్రమైన, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. నాసిరకమైన నాణ్యతలేని వంటకాలు నిల్వ ఉన్న ఆహార పదార్థాలు వినియోగించి నట్లయితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెూటళ్ల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సింగరేణి పరిరక్షణ కోసం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఐఎన్టీయూసీ మహాధర్నా

### అనంతరం మెమోరాండం సమర్పణ






**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాతా సూర్య.ఆగస్టు 14:**
సింగరేణి కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో మహాధర్నా ఘనంగా జరిగింది. బి. జనక్ ప్రసాద్ (ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, శాశ్వత వేజ్ బోర్డు సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్) ఆదేశాల మేరకు, జెట్టి శంకర్ రావు (కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు) అధ్యక్షతన ఈ నిరసన కొనసాగింది.క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, కేంద్ర ఉపాధ్యక్షులు, బెల్లంపల్లి రీజియన్ ఇంచార్జ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ఉద్యమకారులను ఉత్సాహపరిచారు. కేంద్ర నాయకులు, ఐఎన్టీయూసీ కార్యకర్తలు, మైన్స్ మరియు డిపార్ట్మెంట్ల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని "సింగరేణి పరిరక్షించాలి", "కార్మిక హక్కులు కాపాడాలి" అంటూ నినాదాలతో గగనాన్ని మార్మోగించారు.

**మహాధర్నా లక్ష్యం**
సింగరేణి యాజమాన్యం మొండివైఖరి, నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈ ధర్నా చేపట్టబడింది. కార్యక్రమం ముగిసిన అనంతరం, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ యమ్. శ్రీనివాస్‌కు విస్తృత డిమాండ్లతో కూడిన మెమోరాండం సమర్పించారు.

**ప్రధాన డిమాండ్లు:**
జూలై 31 మెడికల్ బోర్డు నిర్ణయాలను రద్దు చేసి పునఃనిర్వహణ
అండర్‌గ్రౌండ్ నుండి అనారోగ్యంతో అన్‌ఫిట్ అయిన వారికి సర్ఫేస్ షూటబుల్ ఉద్యోగాల కల్పన
హౌసింగ్ పథకం ద్వారా ప్రతి కార్మికుడికి సొంత ఇల్లు కల్పన
పెర్క్స్‌పై ఐటి మినహాయింపు అధికారులు పొందిన విధంగా కార్మికులకు కూడా వర్తింపు
భూగర్భ గనుల పునఃప్రారంభం
సేఫ్టీ ట్రైపార్టైట్ సమావేశాల పునఃప్రారంభం
పాత క్వార్టర్ల స్థానంలో కొత్త క్వార్టర్ల నిర్మాణం
ప్రస్తుత బదిలీ విధాన రద్దు
నూతన ప్రమోషన్ పాలసీ అమలు
ఆసుపత్రుల్లో నాణ్యమైన మందులు, డాక్టర్లు, సిబ్బంది నియామకం
35% లాభాల వాటా తక్షణం ప్రకటించాలి
మారుపేర్ల సమస్య పరిష్కారం
డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం కల్పన
విజిలెన్స్ పెండింగ్ కేసులపై లోక్ అదాలత్ నిర్వహణ
మహిళా కార్మికుల కోసం ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు (టాయిలెట్లు, రెస్టురూంస్ మొదలైనవి)

**ఉద్యమానికి ఊపునిచ్చిన నేతలు:**
కేంద్ర నాయకులు కలవేణి శ్యామ్, వెంకట స్వామి, ఏనుగు రవీందర్ రెడ్డి, శీలం చిన్నయ్య, మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, జీవన్ జోయల్, చాట్ల అశోక్, గోపాల్ రెడ్డి, చంద్ర మోహన్, మనోజ్, ప్రవీణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహాధర్నా సింగరేణి కార్మికుల ఏకమత్యం, పోరాటస్ఫూర్తిని మరోసారి ప్రదర్శించిందని పాల్గొన్న నేతలు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు ఈ పోరాటం ఆగదని హామీ ఇచ్చారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

SPORTS స్పోర్ట్స్



# సచిన్ ఇంట్లో పెళ్లి సందడి!

## గుట్టుగా సచిన్ కుమారుడి నిశ్చితార్థం !

భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ ఓ ఇంటివాడు కాబోతున్నాడా? ఇన్ ఫాక్ట్ ఆ దిశగా తొలి అడుగు వేసేశాడా? మీడియాలో ఇందుకు సంబంధించిన ఒక అంశం హల్చల్ చేస్తోంది. తాజాగా ఒక ప్రైవేట్ కార్యక్రమంలో అర్జున్ నిశ్చితార్థం జరిగిందని కథనాలు వెలువడ్డాయి. వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన సానియా చందోక్ అనేయువతితో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిందని సోషల్ మీడియాలో కోడై కూస్తోంది. సానియాతో అర్జున్ ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ పలువురు కంగ్రాట్స్ చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించి అటు టెండూల్కర్ ఫ్యామిలీ కానీ, ఇటు చందోక్ ఫ్యామిలీ గానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రవిఘాయ్ మనవరాలే ఈ సానియా.. వీళ్లకు చాలా వ్యాపారాలున్నాయి. ఇక అర్జున్ తోపాటు అతని సోదరి సారాతో సానియా కలిసి ఉన్న ఫోటోలను నెటిజన్లు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తూ, కంగ్రాట్స్ చెబుతున్నారు. ఏదేమైనా త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.



# మా టీం స్వార్థంతోనే ఆడుతుంది

### పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్

వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన మూడో వన్డేలో పాకిస్తాన్ జట్టు ఘోర పరాజయం పాలైంది. 200 పరుగులకు పైగా భారీ తేడాతో ఓటమిని చవిచూడటంతో, మాజీ క్రికెటర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ఈ ఓటమిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జట్టులో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రయోజనాల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. వెస్టిండీస్‌తో పేలవమైన ప్రదర్శన కనబరిచిన పాకిస్తాన్ జట్టుపై అక్తర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మా కాలంలో మేమంతా ఒక జట్టుగా ఆడేవాళ్లం. దేశం కోసం గెలవడానికి ప్రయత్నించేవాళ్లం. ఒకరిపై ఆధారపడకుండా అందరూ తమ వంతు కృషి చేసేవాళ్లు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత 10-15 ఏళ్లుగా ఆటగాళ్లు కేవలం తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఆడుతున్నారు. వారి సగటును పెంచుకోవడానికి మాత్రమే చూస్తున్నారు" అని అక్తర్ ఘాటుగా విమర్శించారు. "మీరు దేశం కోసం మ్యాచ్‌లు గెలవాలనే తపన చూపించాలి. ఇప్పటికైనా మీరు మారాలి. పరిస్థితులకు అనుగుణంగా ఆడడం నేర్చుకోవాలి. బంతి బాగా కదులుతున్నప్పుడు జాగ్రత్తగా ఆడాలి. మీరు వచ్చి ఆడే పిచ్ అది కాదు. ఆ పిచ్‌ను మీరు ఎక్కడికీ తీసుకెళ్లలేరు" అంటూ పాక్ బ్యాట్స్‌మెన్‌ల ఆటతీరును ఎత్తిచూపారు. ఈ మ్యాచ్‌లో పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ డకౌట్ కాగా, బాబర్ అజామ్ కేవలం 9 పరుగులకే అవుట్ అయ్యారు. దీంతో పాకిస్తాన్ జట్టు కేవలం 92 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమితో వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో కోల్పోయింది. అయితే, అంతకుముందు జరిగిన టీ20 సిరీస్‌ను పాకిస్తాన్ గెలుచుకోవడం గమనార్హం.



# ఆసియా కప్‌కు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్!

ఆసియా కప్ 2025 ప్రారంభం కావడానికి ఒక నెల కంటే తక్కువ సమయం ఉంది. సెప్టెంబర్ 9 నుండి 28 వరకు యూఏఈలో జరగనున్న ఈ టోర్నమెంట్ కోసం బీసీసీఐ ఇంకా భారత జట్టును ప్రకటించలేదు. దీనికి ప్రధాన కారణం.. టీమ్ కెప్టెన్సీపై ఇంకా స్పష్టత లేకపోవడం. సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడంతో, కెప్టెన్ ఎవరు అవుతారనే దానిపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సస్పెన్స్‌కు ఇప్పుడు తెర పడింది. ఆసియా కప్ కోసం టీమ్ ఇండియా కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఉండనున్నారని, శుభ్‌మన్ గిల్‌కు ఈ టోర్నమెంట్‌లో చోటు దక్కడం కష్టమేనని నివేదికలు చెబుతున్నాయి. భవిష్యత్తులో శుభ్‌మన్ గిల్ భారత జట్టుకు కెప్టెన్‌గా ఉంటాడనడంలో సందేహం లేదు, కానీ టీ20 కెప్టెన్సీ మాత్రం 2026 టీ20 ప్రపంచ కప్ తర్వాతే అతనికి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం అందిన నివేదికల ప్రకారం, సూర్యకుమార్ యాదవ్ తన గాయం నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇప్పటికే అతను నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. త్వరలోనే అతని ఫిట్‌నెస్ గురించి అధికారిక ప్రకటన రానుంది. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌లో టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఉండనున్నారని దాదాపుగా ఖరారైంది. మీడియా నివేదికల ప్రకారం, ఆగస్టు 19 లేదా 20న బీసీసీఐ ఆసియా కప్ కోసం భారత జట్టును ప్రకటించనుంది. టీ20 ఫార్మాట్‌లో భారత్ గత ఏడాది కాలంగా ఒక నిర్దిష్ట జట్టుతో ఆడుతోంది. ఆ జట్టులోని ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. కాబట్టి, ఆసియా కప్‌లో కూడా మేనేజ్‌మెంట్ అదే జట్టుపై నమ్మకం ఉంచే అవకాశం ఉంది. దీంతో శుభ్‌మన్ గిల్‌కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కడం కష్టమేనని తెలుస్తోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాళ్లను టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉంచే అవకాశం ఉంది.

# లియాండర్ పేస్ తండ్రి కన్నుమూత



హాకీ దిగ్గజం, ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్ తండ్రి వేస్ పేస్ (80) కన్నుమూశారు. ఆగస్టు 12న తీవ్ర అనారోగ్యంతో కోల్‌కతాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నట్టు సమాచారం. 1972 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టులో వేస్ పేస్ సభ్యుడిగా ఉన్నారు. కుమారుడు లియాండర్ పేస్ టెన్నిస్‌లో అద్భుత విజయాలుసాధించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. తుదిశ్వాస విడిచిన వేస్ పేస్ 1972 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న భారత హాకీ సభ్యుడు. వెస్‌కు గత ఏప్రిల్‌లో 80 ఏళ్లు నిండాయి. మాజీ హాకీ దిగ్గజాన్ని కోల్పోవడంతో క్రీడా ప్రపంచం విచారంలో మునిగిపోయింది. హాకీతో పాటు, అతను క్రికెట్, ఫుట్‌బాల్, రగ్బీ కూడా ఆడాడు. అద్భుతమైన క్రీడా వృత్తికి అతీతంగా మాంగ్దర్శకుల్లో ఒకరిగా వెస్‌ను అభిమానులు గుర్తుంచుకుంటారు. గోవాలో జన్మించినప్పటికీ, ఆయన తన జీవితంలో ఎక్కువ భాగం కోల్‌కతాలో గడిపాడు. తన క్రీడా జీవితం తర్వాత అతడు స్పోర్ట్స్ మెడిసిన్ చదివాడు. అతడు స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్‌లో కూడా పనిచేశాడు. అతడి ముఖ్యమైన సేవలలో ఒకటి డోపింగ్ నిరోధక అధికారిగా భారత క్రికెట్ నియంత్రణ మండలిలో ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ డేవిస్ కప్ జట్టుతో కూడా అతడు పనిచేశాడు. 1996-2002 వరకు రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. ఏథెన్స్ 2004 ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టుకు జట్టు వైద్యుడిగా కూడా పనిచేశాడు. ముఖ్యంగా, వెస్ కుమారుడు లియాండర్ కూడా 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్నాడు."నిజమైన క్రీడా దిగ్గజం డాక్టర్ వెస్ పేస్ మరణించారు. మైదానంలో, వెలుపల ఆయన సాధించిన విజయాలు తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి.




# ఒక పార్వతి ..ఇద్దరు దేవదాసులు

మాహిష్మతి ప్రొడక్షన్స్ పతాకంపై తోట రామకృష్ణ దర్శక నిర్మాతగా రూపొందిస్తున్న చిత్రం ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు త్రంలో సిద్ధార్థ్ మీనన్, దిలీప్ హీరోలుగా నటిస్తుండగా.. రాశిసింగ్ హీరోయిన్‌గా నటిస్తుంది. కాలేజ్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ యువతను ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర బృందం తెలియజేసింది. ఈ చిత్రంలో రఘుబాబు, కశిరెడ్డి రాజ్‌కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత వంటి ప్రముఖ నటులు ముఖ్య పాత్రలు పోషించారు. సినిమా చిత్రీకరణ ఇప్పటికే పూర్తయింది, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీ-వల విడుదలైన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మోహిత్ రహమానియాక్ స్వరాలు అందిస్తున్నారు. ఆస్కార్ విజేత చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, భాస్కరభట్ల వంటి ప్రముఖ గీత రచయితలు పాటలు రాశారు. శ్రీనివాసరాజు సినిమాటోగ్రఫీ, గన్ ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. శరత్ వర్మ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. పీఆర్‌ఓలు గణేష్, కుమార్.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

CINEMA సినిమా

# పరదా సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది

### నటి అనుపమా పరమేశ్వరన్ విశ్వాసం

'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు చెప్పారు. ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్ర బృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీ-మ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను అన్నారు. ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటు-న్నట్లు- చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.





# శ్రీవారి సేవలో పరమ్ సుందరి జంట

కలియుగ దైవం తిరుమల శ్రీవారిని బాలీవుడ్ సినీ నటీనటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా దర్శించుకున్నారు. గురువారం ఉదయం తిరుమలకి చేరుకున్న వీరిద్దరూ నైవేద్య విరామ సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించి, పట్టు వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పరమ్ సుందరి'. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఈ సినిమా హిట్టు- అవ్వాలని కోరుకుంటూ ఈ జంట తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.